# ధర్మవాహిని





భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

## II

# ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి

**ధర్మకర్మల ననుసరించి యుగములు ఏర్పడినవి :**

హిందూధర్మ సంబంధమైన ఆధ్యాత్మిక ధర్మకర్మల ననుసరించి స్థూలరూపమున యుగములు మూడు విధములుగానున్నవి. ఒకటి, కర్మయే ప్రధానముగాగల వైదిక యుగము; రెండు, జ్ఞానమే ప్రధానముగాగల ఉపనిషద్ యుగము; మూడు, భక్తియే ప్రధానముగాగల పౌరాణిక యుగము.

వైదిక సాహిత్యము సంహితలు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులను నాలుగు భాగములుగా విభజింపబడినది. అందులో మొదటి మూడైన సంహిత, బ్రాహ్మణ, ఆరణ్యకములలో కర్మకాండమూ, ఉపనిషత్తులలో జ్ఞానకాండమూ ప్రతిపాదింపబడియున్నవి. వేదసంహితా భాగముల మంత్ర సమూహము ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, సూర్యుడు, రుద్రుడు మొదలగు దేవతలయొక్క స్తోత్రములతో నిండియున్నది. ఈ మంత్రములతోనే ప్రాచీన ఆర్యులు, దేవతలనుద్దేశించి యజ్ఞయాగాదులు ఆచరించి అభీష్టసిద్ధి నందుచుండెడివారు.

పరమాత్మ ఒక్కడై, అద్వితీయుడైయుండికూడా వివిధములగు దేవతానామములతో వ్యక్తమగుచున్నాడన్న సత్యసూత్రమును మన పూర్వులు గ్రహించినట్లు, ఈ తత్త్వమును గూర్చి ఋగ్వేదమందనేక మంత్రములలో నుద్ఘోషించబడినది :

ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి
అగ్నిం యమం, మాతరిశ్వానమాహుః॥

తత్త్వదర్శనులగు మహాత్ములు, ఒకే సత్పదార్థమగు పరబ్రహ్మమును యముడు, అగ్ని, మాతరిశ్వుడు మొదలగు వివిధ నామములతో పేర్కొనుచున్నారని దీని అర్థము. అట్టి అద్వితీయుడగు బ్రహ్మము ఋగ్వేదమునందలి పదపదమునందున హిరణ్యగర్భుడు, ప్రజాపతి, విశ్వకర్మపురుషుడు మొదలగు నామములతో ప్రకటింపబడియున్నాడు. దీనికి ఋగ్వేదముయొక్క హిరణ్య గర్భ సూక్తము, పురుషసూక్తము మొదలగునవే ప్రమాణము.

**సమస్త ఆరాధనలకు శ్రద్ధయే ప్రధానాంగము :**

ప్రాచీనార్యులయొక్క ప్రధానమగు అనుష్ఠానము ధర్మము. అదియే యజ్ఞము. వారియొక్క యజ్ఞాద్యనుష్ఠానములు, అర్చనలు, వందనములు, నమస్కారములు మొదలగు భక్త్యంగములతో కూడియున్నవి. వేదసంహితలలో 'భక్తి' శబ్దప్రయోగము సుస్పష్టముగా కనబడకపోయిననూ ఆ అర్థములో "శ్రద్ధ" అను శబ్దప్రయోగము తరచుగా కనపడుచుండును కదా!

శ్రద్ధయాగ్నిః సమిధంతే శ్రద్ధయో హోయతే హవిః॥
శ్రద్ధాంభగస్య మూర్ధని వచసా వేదయామసి ॥

శ్రద్ధద్వారా మాత్రమే యజ్ఞాగ్ని ప్రజ్వలితమగుచున్నది, శ్రద్ధ వలననే హవిర్భాగముల ఆహుతి లందబడుచున్నవి. సమస్తమగు ఆరాధనలకూ ప్రధానాంగమైన శ్రద్ధను మేము స్తుతించుచున్నాము,

అని పై శ్లోకార్థము. చూడుడు! శ్రద్ధ యెంత పవిత్రశక్తి కలిగినదో యోచించుడు.

వేదకాలమున దైవభక్తి మూలకములగు సహజ, సరళ ధర్మములు పరిశీలన కందుబాటులో నుండెడివి. ఇటీవల ఆ భక్తి ధర్మములు జటిలములగు క్రియావిశేషములతో కూడిన బహుళ యజ్ఞానుష్ఠానములందు మరుగుపడిపోయినవి. కాలక్రమమున అట్టి మతమభివృద్ధి నొంది, 'యజ్ఞమే మనకు ధర్మము, ఆ యజ్ఞానుష్ఠానమువలననే జీవులు సర్వసుఖములు పొందగలరు', అని బోధించిరి. అయితే, యజ్ఞానుష్ఠానము దేవతల నుద్దేశించి యీయబడుచున్ననూ, యజ్ఞమునకు మాత్రమే ప్రాముఖ్యముండెను. దేవతలు గౌణములు. అందుచేత, "యజేత స్వర్గకామః" స్వర్గ సుఖాపేక్షతో మాత్రమే యజ్ఞములు చేయవలసినదని వేదవాదమను పేర బోధింపబడసాగెను.

**నామ, రూపాత్మకమైన దృశ్య ప్రపంచములో నిత్య సత్యమైన పరబ్రహ్మకలడు :**

ఇంతలో ఉపనిషద్యుగము ప్రారంభమయ్యెను. చైతన్య రహితమగు భౌతికవాదముల ఖండించుచూ, ఉపనిషత్తులలో, వేదకర్మకాండము మానవులను సంసారసాగరమునుండి తరింపచేయుటకు 'నావ'గా ఆవిర్భవించెను. ఉపనిషద్యుగమునందలి సాధకుని దృష్టి బాహ్యాజగత్తును ఛేదించుకొని అంతర్ జగతిపై కేంద్రీకృతము కాజొచ్చెను. ఉపనిషద్

ఋషులందరును కలసి చరమతత్త్వముయొక్క స్వరూపనిర్ణయము ఈ విధముగ చేసియుండిరి. ఈ నామరూపాత్మకమగు దృశ్య ప్రపంచాంతరాళములో నిత్యమైన, శాశ్వతమైన ఒక సత్పదార్థము గలదు. అదియే పరబ్రహ్మము. ఆ పరమేశ్వరుని జ్ఞానయోగము వలన గ్రహించవలెను. "తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ" ఈ బ్రహ్మవిద్యనే ఉపనిషత్తులు (వేదాంతము) ప్రతిపాదించుచున్నవి. ఇంతియే కాదు; ఇంకనూ ఉపనిషత్తులిట్లు చెప్పుచున్నవి; వేదవాదము స్వర్గ సాధనమైననూ మోక్షసాధనమునకుకూడ ఆధారము. కేవలము బ్రహ్మవిద్యాలంబనముతో పరబ్రహ్మప్రాప్తి లభ్యమగుచున్నదని కూడా తెలిపెను.

**పరమేశ్వరుడే జీవులకు గతి, సంపద, లోకము, పరమానందము :**

ఉత్తమ విషయము లనేకములు పఠించుటవలనగానీ, గ్రంథధారణాశక్తివలనగానీ, పాండిత్య ప్రకర్షవలనగానీ ఈ పరమాత్మను పొందుటకు వీలుకాదు. ఏ సాధకుడు పరమాత్మను ఉపాసించునో అతడు మాత్రము పరమాత్మను పొందును. అయితే, మరొకటి మరువరాదు; పైచెప్పిన గ్రంథపఠన, గ్రంథధారణా శక్తి, పాండిత్య ప్రకర్షలుండియూ, అందులో పరమాత్మోపాసన ప్రాప్తించినవాడు పరమపుణ్యుడు; ధన్యులలో ధన్యుడు. పరమాత్మ ప్రత్యక్షస్వరూపమున అతనియెదుట నిలుచును. అందుకనే బృహదారణ్యకోపనిషత్తు జీవునకూ, పరమాత్మకు గల సంబంధమును ఈ రీతిగా తెలిపెను.

ఏషాఽస్య పరమా గతిః
ఏషాఽస్య పరమా సంపత్ ॥
ఏషోఽస్య పరమో లోకః
ఏషోఽస్య పరమానందః ?

పరమేశ్వరుడే ఈ జీవులకు పరమ గతి, పరమ సంపద, పరమ లోకము, పరమానందమై యున్నాడు.

తైత్తిరీయోపనిషత్తు నందిట్లుద్ఘోషింపబడినది: "ఆ పరమాత్మ రసస్వరూపమగు తృప్తి హేతువు. రసస్వరూపుడగు పరబ్రహ్మమును పొంది జీవుడు ఆనందింపగలడు. హృదయాకాశమునందు ఈ ఆనంద స్వరూపుడగు పరమాత్మ లేకున్న, ఎవడు చలించును? ఎవడు జీవించును? అతడే అందరికిని ఆనందమునిచ్చుచున్నాడు". అందుచేతనే వేదసంహితలతో నాటబడిన భక్తిబీజము ఉపనిషద్గ్రంథములందు అంకురించి, పురాణములందు క్రమేణా శాఖోపశాఖలుగా విస్తరించి ఫలపుష్ప భరితమగు మహావృక్షముగా పరిణమించినది.

అయితే "యేది భక్తి? యెట్టిది భక్తి?" అని పెక్కుమంది సందేహమనస్కులై, సతమతమగుచున్నారు. భక్తిభావములు ఇట్టివని యెవ్వరునూ నిర్ణయించలేరు. అవి అనేకములు. వానిని నిర్మలము, కోమలము, ఉదారము, శాంతము, ప్రేమమయమునగు హృదయముగల, భక్తజన మానస మరాళములగు సాధుశిరోమణులే యెరుగజాలుదురు. కానిచో పాషాణమున నవనీత కోమలత్వము,

అగ్నియందు హిమశైత్యము, వేమున మకరంద మాధుర్యము సంభావ్యములా?

భక్తులకు భగవానుడును, భగవానునకు భక్తులును, ప్రాణము కన్న ప్రియులు; మహాత్ములు కొందరు భక్తులే భగవానునికన్న గొప్పయందురు. చూడు! రైతులకు మేఘముల మీద ప్రీతి మెండు. ఏలన, వారి పైరుపంటలు మేఘముల వలననే వృద్ధి పొందును. సముద్రమే స్వయముగా వచ్చి వారి పొలములను తడుపదు. ఇట్లు భక్తులను మేఘములతోను వాయువులతోను పోల్చి తులసీదాసు ప్రశంసించియున్నాడు. భక్తులు దయ, ఉదారత, ప్రేమ, సౌశీల్యము మొదలగు భగవద్గుణములను లోకమున ప్రసరింతురు. గనుల నుండి బంగారు వచ్చినట్లే ఈ సుగుణములన్నియూ వారికి భగవానునినుండియే వచ్చును.

ఒక విషయము యోచించుడు. భక్తిభావమును గూర్చి ఒకానొక దినమున దుర్వాసమహర్షి అంబరీషుని పరీక్షింప నెంచి వచ్చెను. అకారణ క్రోధమున అతని నాశనముకై "కృత్య"ను పుట్టించెను. కానీ, భక్తభయహరమగు భగవానుని చక్రము "కృత్యను" తుదముట్టించి దుర్వాసుని వెంటబడెను. ప్రాణ సంరక్షణకై దుర్వాసుడు ఆశ్రయ మపేక్షించి వనములు, పర్వతములు సరస్సులు, సముద్రములు, నదులు, సత్యలోకము, కైలాసము, ఆకాశము, సమస్త ప్రదేశములు తిరిగెను. దీనుడై ఆశ్రయమర్థించెను; కానీ, భక్తద్రోహి కాశ్రయ మెందునా లభించలేదు.

తుదకాతడు వైకుంఠమునకు పరుగిడి శ్రీమన్నారాయణుని చరణారవిందములమీద పడి రక్షణభిక్ష నర్థించెను. అప్పుడు భగవానుడు ఇట్లు చెప్పెను :

**నాకు మేలు గోర నా భక్తులకు కాని**
**భక్తజనుల కేన పరమగతియు**
**భక్తు డెందు జనిన పరతెంతు వెనువెంట**
**గోవువెంట దవులు కోడె భంగి**
**తనువు మనువు విడిచి, తనయుల చుట్టాల**
**ఆలి విడిచి సంపదాలి విడిచి**
**నన్నుకాని యన్యమెన్నడు నెరుగని**
**వారి విడువ నెట్టివారి నైన.**

ఒకానొక సమయమున కృష్ణుడు ఉద్ధవునకు ఇట్లు చెప్పెను: "తపస్సు, జ్ఞానము, వైరాగ్యము, యోగము, దానము, ధర్మము, వ్రతము, తీర్థసేవనము మొదలగు సాధనముల వలన ఎట్టి ఫలితము లభించుచున్నదో, అట్టి ఫలితమును నా భక్తులు అనాయాసముగా పొందుచున్నారు". ఈ విషయమెంత సారముతో చేరియున్నదో యోచింపుడు. ఇంతేకాదు; పరమేశ్వరుని యందైకాంతిక భక్తివలన చండాలుడనువాడు కూడా బ్రాహ్మణునికన్నా అధికుడు కాగలుగుచున్నాడనియు, పరమేశ్వర భక్తిహీనుడగు బ్రాహ్మణుడు సైతము చండాలునికన్నా అధమునిగ పరిగణింపబడుచున్నాడనియు, పురాణములందుకూడ అనేక సమయములందు ఉద్ఘోషితమై యున్నది కదా!

ఇక పురాణములయొక్క మహా ధర్మము; వేదములు నేతి నేతి యని చెప్పుచూ, "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సః" అని పలుకుచు, ఏ పరతత్త్వమును ఇంద్రియ మనోబుద్ధ్యతీతమైన ఒకానొక అగమ్య దేశమునందుంచి, అది కేవలము ఉచ్ఛస్థితినందిన జ్ఞానులకు మాత్రమే ధ్యానగమ్యమని వచించుచున్నచో, అట్టి పరమతత్త్వమును భక్తిసాధన సౌలభ్యముతో భక్తజనులయొక్క సమస్తేంద్రియ గోచరభూతముగ చేయుచున్నది.

**దేహాత్మ భావము నశించనిదే నిర్గుణ బ్రహ్మోపస్థితి లభించదు :**

పురాణములలోని భగవానుడు కేవలము జ్ఞేయ బ్రహ్మము, నిర్గుణుడు, నిర్వికారుడు, అద్వితీయుడు, చిత్స్వరూపుడు, జగత్కారకుడు మాత్రమేకాక ప్రత్యక్షముగా నుపాసింపదగిన, ఆరాధింపదగిన ప్రేమఘనమూర్తి. సౌందర్య మాధుర్య నికేతనుడు, అశేష కళ్యాణ గుణాకరుడై యున్నాడు; ఇంతేకాక, పురాణము మరొక విధముగా కూడా బోధించుచున్నది. ఏమన, జ్ఞానమార్గమునందలి అవ్యక్తమగు నిర్గుణ బ్రహ్మోపాసనము దేహాభిమానులగు జీవులకు మిక్కిలి కష్టము. దేహాత్మభావము నశించనిదే నిర్గుణ బ్రహ్మోపస్థితి లభించదు. భక్తియోగము నందలి బ్రహ్మోపాసన సామాన్య మానవులకు సహితము సులభ సాధ్యము.

ఈ కారణము చేతనే పురాణములందు సగుణోపాసనను గూర్చి విశేషముగ చెప్పబడియున్నది; మొదట సగుణోపాసనద్వారా చిత్తైకాగ్రతను సాధించి, స్థూల సౌరాన్ధికా న్యాయము ననుసరించి

భగవత్ నిర్గుణ స్వరూపములో చిత్తమును లయమొనర్చవలెను, జలాశయము వరకూ వెళ్ళుటకసమర్థుడగు దప్పిగొన్న మానవుని, ఎండమావులు బహుదూరము ఈడ్చుకొనిపోవుచున్నవి. తదుపరి మార్గమున సత్యమైన జలాశయమును సమీపించినమీదట, ఆ మానవునకు, జలాస్వాదనప్రాప్తి కలుగుచున్నది. దీనినే స్థూలసౌరామ్భికాన్యాయ మందురు.

అదే విధముగ, ముముక్షువులగు సాధకులు సహజముగనే నిర్గుణోపాసనాతత్పరులగుదురు. భక్తవత్సలుడగు భగవానుడు నిరాకారుడైయుండికూడ, సాధుమహాత్ములయొక్క ఇష్టదేవతా స్వరూపమున సాక్షాత్కరించును. వారి వారి ఇష్టార్థమును, ధర్మార్థ కామమోక్షములను, చతుర్విధ పురుషార్థములను ప్రసాదించును.

